ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి ములుగు

మంగళవారం 16 ఏప్రిల్ 2024



వడ్డీ మాఫియా!





వరంగల్‌లోని ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కార్పొరేటర్ ప్రజల నుంచి నెలవారీ చిట్టీల పేరుతో సుమారు రూ.2కోట్ల వరకు డబ్బులు వసూ లు చేశాడు. చివరకు వసూలు చేసిన డబ్బులను తనకు చిట్టీలు కట్టిన వారికి ఇవ్వ కుండా.. తనకే నష్టం వచ్చిందని బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితులు ఇంతేజార్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తీసుకున్న అప్పు చెల్లించలేదంటూ హనుమకొండకు చెందిన ఓ వ్యక్తిని... తమకు ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలని వడ్డీ వ్యాపారి ఒత్తిడి చేస్తున్నాడు. దీంతో ఆ బాధితుడు లబోదిబోమంటున్నాడు.

వరంగల్ రంగశాయపేటలో అధిక వడ్డీ బాధితుడు ఒకరు సొంత ఇంటిని, ఇంటి స్థలాన్ని కోల్పోయాడు. రూ.1లక్ష అప్పు తీసుకుంటే.. నాలుగేళ్లలో సొంతింటిని కోల్పోయే స్థాయిలో అతడి అప్పులు పెరిగిపోయాయి. దీంతో బాధితుడి కుటుంబం వీధిన పడింది.

శివనగర్‌లో ఓ యువకుడు వడ్డీ వ్యాపారి నుంచి రూ.1.30లక్షల అప్పు తీసుకున్నారు. దీనికి రూ.10 చొప్పున వడ్డీ చె ల్లిస్తున్నాడు. ఏడాది కాలంలోనే రూ.1.38లక్షల అప్పునకు రూ.1.28లక్షల వడ్డీ చెల్లిం చాడు. అయితే అరోగ్యం బాగా లేకపోవటంతో అసలు డబ్బు మాత్రం చెల్లించక పోవడంతో వడ్డీ వ్యాపారి వేధిం చడం మొదలు పెట్టడంతో బాధి తుడు మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

- జనం అవసరాలే ఆసరాగా కొందరి అధిక వడ్డీ దందా
- రూ.100కు రూ.10 చొప్పున వడ్డీ వసూలు
- మైక్రో ఫైనాన్స్, నెలవారీ చిట్టీల పేరిట జనం సొమ్ము దోపిడీ
- అక్రమంగానే వ్యవహారమంతా..
- చోటామోటానేతలు, కొందరు కార్పొరేటర్లు, వారి అనుచరులే సూత్రధారులు
- రూరల్ ప్రాంతాల్లో వడ్డీపై పోలీసుల ఉక్కుపాదం
- నగరంలో మాత్రం ఖాకీలది ప్రేక్షక పాత్రే!

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి- వరంగల్)

రూ.100కు రూ.10, రూ.వెయ్యికి రూ.100, రూ.లక్షకు రూ.పది వేలు.. ఇదీ వడ్డీ వ్యాపారుల లెక్క. జనాల అవసరా లను ఆసరాగా చేసుకుని జలగల్లా పట్టి పీడిస్తున్న వడ్డీ మాఫియా కథ. ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసు కుని కొందరు అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ.. ఆస్తులు, బంగారం తాకట్టు పెట్టుకుం టున్నారు. ఆ అప్పు చెల్లించకుంటే తాకట్టు పెట్టుకున్న ఆస్తిని జప్తు చేసుకుంటున్న సంఘటనలున్నాయి. దీంతో ఆధిక వడ్డీలు చెల్లించలేక మానసిక, ఆర్థిక ఒత్తిడితో అనేక కుటుంబాలు రోడ్డున పడు తున్నా యి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో పోలీసుల అండ దండలతోనే ప్రైవేట్, డైలీ ఫైనాన్స్ మాఫియా రెచ్చిపోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అవసరాలే ఆసరాగా...

డబ్బు అత్యవసరం ఉన్న ప్రజలే లక్ష్యంగా కొం దరు వడ్డీ వ్యాపారులు తమ దందా సాగి స్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని జిల్లా కేంద్రాలతో పాటు మునిసి పాలిటీల్లో గిరిగిరి దందా జోరుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ వ్యవ హారంతో అనేక మంది జీవితాలు వీధిన పడుతు న్నాయి. ముఖ్యంగా చిరు వ్యాపారులు, కూరగాయ లు, పండ్లు విక్రయించే వీధి వ్యాపారులు, ఆటో నడుపుకొనే వారు, కూలీలు లక్ష్యంగా వడ్డీ వ్యాపా రం జరుగుతోంది. డబ్బులు అత్యవసరం ఉన్నవారి నుంచి రూ.100కు రూ.10వడ్డీ వసూలు చేస్తున్నారు. రూ.10వేల అప్పు తీసుకున్న వారికి రూ.వెయ్యి కోత పెట్టి రూ.9వేలు ఇస్తున్నారు. వారానికి రూ.వెయ్యి చొప్పున పదివారాల్లో వసులు చేస్తున్నారు. ఇంకొన్ని చోట్ల ఉదయం రూ.900 ఇచ్చి సాయం త్రం రూ.వెయ్యి తీసుకుంటున్నారు. 12గంటల తిరగక ముందే ఒక వెయ్యి రుపా యలకు రూ.100 వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇలా ఒక రోజు లక్ష రుపాయలు వడ్డీకి ఇస్తే ఒక రోజులోనే రూ.10 వేల వడ్డీ లాగేస్తున్నారు. నెలకు రూ.వెయ్యికి రూ.వంద వడ్డీ చొప్పున వసూలు చేస్తున్నారు. అప్పు ఇచ్చే సమయంలో ఖాళీ చెక్కులు, పట్టాదారు పాసు పుస్తకాలు, బంగారు నగలు, స్థిరాస్తి హక్కు పత్రాలు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు ఇతర వాహనాలను తాకట్టు పెట్టుకుంటున్నారు. ఒక వేళ ఏదైనా కారణాలతో అప్పు చెల్లించకపోతే తాకట్టు పెట్టుకున్న ఆస్తిని లాక్కుంటున్నారు. ఖాళీ చెక్కులతో కోర్టుల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులు పెడుతున్నారు. దీంతో చాలామంది మానసికంగా ఒత్తిడికి గురవుతు న్నారు. సమాజంలో పరువు పోతుందని కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్న సంఘటనలు ఉన్నాయి.

దందాలో రాజకీయ నేతలు, టీచర్లు, పోలీసులు

గిరిగిరి దందాలో కొందరు రాజకీయ నేతలతో పాటు చాలా ప్రాంతాల్లో కొం దరు టీచర్లు కూడా ఉన్నారు. ప్రధానంగా వరంగల్ పోలీస్‌కమిషనరే ట్ పరిధిలో వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతుంది. కొన్ని ఏరియాల్లో పోలీసు ల అండదండలతోనే అధిక వడ్డీ వ్యాపా రం సాగుతున్నట్లుగా ప్రచారం జరుగు తోంది. వరంగల్ తూర్పు ప్రాంతంలో ముగ్గు రు కార్పొరేటర్లు, మరో నలుగురు మాజీ కార్పొరే టర్లు వడ్డీ వ్యాపారం రూ.లక్షల్లో సాగిస్తున్నారు. అధికార పార్టీ అండదండలు కొందరికి ఉండగా, మరికొందరికి ఖాకీల సాన్నిహి త్యం ఉన్నట్టు సమాచారం. దీంతో శివనగర్, రంగాశా యిపేట, బట్టల బజారు, ఉర్సు, రైల్వేగేటు, మిల్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో గిరిగిరి తో పాటు రూ.లక్షల్లో వడ్డీ వ్యాపారం సాగి స్తున్నారు. అధికార బలంతో పాటు ఖాకీల సహకారం ఉండటంతో ఫైనాన్స్ దందాను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. వరంగల్ పశ్చిమ

మిగతా 7వ పేజీలో..

చిట్టీల పేరిట చీటింగ్..

కొందరు నెలవారీ చిట్టీల పేరుతో ప్రజలను దోచుకుంటున్నారు. రూ.లక్ష చిట్టీని 25మంది నెలకు రూ.4వేల చొప్పున 25నెలలు చెల్లించాలి. ఇందులో డ్రా తీసి ఎవరికి వస్తే వారికి కొందరు చెల్లిస్తుండగా, ఎవరు ఎక్కువ పాట పాడితే వారికి ఇస్తున్నారు. డబ్బులు అత్యవసరం ఉన్నవారు రూ.లక్షకు రూ.25వేల వరకు కూడా పాడి డబ్బులు తీసుకుంటున్నారు. దీంతో 25శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. పైగా చిట్టీ నిర్వహకులు కూడా ప్రతీ వ్యక్తి నుంచి 5శాతం కమీషన్‌గా తీసుకుంటున్నారు. అయితే ఈ చిట్టీల వ్యాపారుల్లో కొందరు.. తమకు చిట్టీల డబ్బులు చెల్లించిన వారికి ఇవ్వకుండా ఉడాయించిన సంఘటనలున్నాయి. అలాగే మండల కేంద్రాల్లో లక్కీ డ్రాల పేరుతో ద్విచక్ర వాహనాలను ఆశ చూపుతు లక్షల్లో వసూళు చేసి దుకాణం మూసేస్తున్నారు.



కమిషనరేట్ పరిధిలో మౌనమేల?

అధిక వడ్డీ వ్యాపారులపై రాష్ట్ర వ్యాప్తంగా దాడులు జరుగుతుంటే.. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు మౌన ముద్రలో ఉండ టంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూ పాలపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 8వ తేదీన ఫైనాన్స్ వ్యాపారి వేధింపులు భరించలేక గణేష్ చౌరస్తాలో నివాసం ఉంటున్న బయ్యావుల ఏడు కొండలు అనే చిరు వ్యాపారి ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడ్డారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసుశాఖ రాష్ట్రవ్యాప్తంగా వడ్డీ వ్యాపారులపై నిఘా పెట్టి తనిఖీలు చేపడుతుంది. ములుగు పోలీసులు ఏటూరునాగరంలోని ఓ మహిళ వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదాలు చేసి, విలువైన దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. భూపాలపల్లి జిల్లాలో భూపాలపల్లి, మహదేవపూర్‌లోని వడ్డీ వ్యాపా రుల ఇళ్లలో సోదాలు చేశారు. అయితే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాత్రం వడ్డీ వ్యాపారులపై పోలీసుల దాడులు లేకపోవడం వెనుక మతలబు ఏంటన్న చర్చ జరుగుతోంది. ఇక్కడి వడ్డీ వ్యాపారుల్లో అనేక మంది రాజకీయ నేతలు, వారి అనుచరులు ఉండటంతోనే వారిని టచ్ చేసేందుకు ఖాకీలు సాహసం చేయడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. కోట్లాది రుపాయలను అధిక వడ్డీలకు తిప్పుతు న్నారనే సమాచారం ఉన్నా పోలీసులు పట్టించు కోకపోవడం చర్చనీయాంశంగా మారింది. 2022 జూలై 28న వడ్డీ వ్యాపారుల వేధింపులు తట్టు కోలేక ఓ మహిళ మట్టేవాడ మహిళ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. పోలీసులు వడ్డీ వ్యాపా రికి వత్తాసు పలకటంతో పోలీస్‌స్టేషన్‌లోనే పురు గుల మందు తాగిన సంఘటన ఖాకీల పరువు ను బజారున పడేసింది. అయినప్పటికీ పోలీసుల తీరులో మాత్రం మార్పు రాలేదన్న చర్చ జరుగుతోంది.

ఏడుగురు కానిస్టేబుళ్లపై బదిలీ వేటు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన ఎస్పీ

భూపాలపల్లి(ఆంధ్రజ్యోతి)/మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 15: మహదేవపూర్ సర్కిల్‌లో పనిచేసే ఏడుగురు కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మహదేవపూర్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ ఎస్పీ కానిస్టేబుల్‌తోపాటు పలువురు కానిస్టేబుళ్ల అవినీతి బాగోతాన్ని వెలుగులోకి తెస్తూ 'ఇక్కడంతా షరా 'మామూలే..' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై ఎస్పీ స్పందించారు. వెంటనే విచారణ చేపట్టి చర్య తీసుకున్నారు. మహదేవపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఉపేందర్‌ను గణపూర్‌కు, కానిస్టేబుల్స్ బి.ధనుంజయ్‌ను మొగుళ్లపల్లికి , కె.అరుణ్‌ను రేగొండకు, ఎస్.విక్రాంత్‌ను కాటారం, జి.కిరణ్‌ను చిట్యాల, జె.తిరుపతిని కొయ్యూర్, ఎస్పీ విభాగంలో పనిచేస్తున్న పి.నాగరాజును టేకుమట్ల పీఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వేసవి జాగ్రత్తలపై కూలీలకు అవగాహన కల్పించాలి



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

డీఎంహెచ్‌వో అప్పయ్య

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 15: ఎండ లు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని, వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలీలకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య ఆదేశించా రు జిల్లా కేంద్రం నుంచి ఆయన సోమవా రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలోని ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. ఉపాధి హామీ పథకం, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేస్తున్న కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, తునికాకు సేకరిస్తున్న కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. ఇప్పటి వరకు 30 వేల ఓఆర్ఎస్ ప్యాకె ట్లు పంపిణీ చేశామని అన్నారు. పనులకు వెళ్లేవారు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు తీసుకెళ్లాలని, అంతేకాకుండా నిమ్మరసం, మజ్జిగ, పండ్ల రసాలు సేవించాలని అన్నారు. ఆయా పనులకు వెళ్లిన కూలీలు ఉదయం 11గంటల లోగా తిరిగి ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. బయటకు వెళ్లినప్పుడు గొడు గు, టోపీ, టవల్ లాంటి సంప్రదాయ తలపాగా ఉపయోగించాలని, ప్రయా ణం చేసే సమయంలో తాగునీటిని వెంట తీసుకెళ్లాలని అన్నారు. ముఖ్యంగా కాఫీ, టీ, ఆల్కహాల్, కార్బొనేటెడ్ శీతల పానీయాలు తీసుకోకూడదని అన్నా రు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని, జిల్లాలోని ప్రజ లు వడదెబ్బబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

మధుయాష్కీని పరామర్శించిన సీతక్క



అనసూయమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, ఏప్రిల్ 15: టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ తల్లి అనసూయమ్మ సోమవారం మృతి చెందారు. హైదరాబాద్‌లోని మధుయాష్కీ నివాసంలో ఆమె మృతదేహాన్ని మంత్రి సీతక్క సందర్శించి నివాళులర్పించారు. మధు యాష్కీతోపాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 15: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశపుహాల్‌లో ఆమె అధికారులతో సోమవారం సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందు ప్రజల్లో అవగాహన కల్పించాలని, పోలింగ్‌కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా సౌకర్యం లేని ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రతి ఒక్కరికి భార త ఎన్నికల సంఘం నియమావళి నిబంధనలపై అవగాహన కల్పించాల న్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుం డా సజావుగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోజు వారీ నివేదికలను సకాలంలో పంపాలని సూచించారు. ఎస్పీ శబరీశ్ మా ట్లాడుతూ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మరింత సమర్థంగా పనిచేయాలని, ప్రతి అంశంపై జాగ్రత్తగా, నిబద్ధతతో వ్యవహరించాలన అన్నారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఎస్పీ రవీం దర్, తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూంను తనిఖీచేసిన కలెక్టర్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం స్ట్రాంగ్ రూంను కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయ కులతో కలిసి తనిఖీ చేశారు. గోదాం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదే శించారు. అనుమతి లేనిదే గోదాం పరిధిలోకి ఎవరూ రాకూడదని సూచిం చారు. స్ట్రాంగ్‌రూంలో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండాలని, అధికారులు సీసీ కెమెరాలను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం స్థలాన్ని పరిశీలించారు. మౌలిక సౌకరాయలు కల్పించాలి అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపా ల్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్, తహసీల్దార్లు విజయభాస్కర్, రవీందర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ములుగు జిల్లాకు జైలు మంజూరు

ఏర్పాటుపై సమీక్షించిన అధికారులు



అధికారులతో చర్చిస్తున్న జిల్లా జడ్జి

ములుగు, ఏప్రిల్ 15: ములుగు జిల్లాకు నూతనంగా జైలు మంజూరైంది. దీని ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా ప్రధాన జడ్జి ఎస్‌వీపీ.సూర్యచంద్రకళ అధికారులతో సోమవారం చర్చించారు. జైలు ఏర్పాటు కమిటీ సభ్యులైన ఎస్పీ శబరీశ్, సీనియర్ సివిల్ జడ్జి టి.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థల సేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. రాబోయే 50ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మోడల్ జైలు నిర్మాణం చేయాల్సి ఉందని జడ్జి సూర్యచంద్రకళ తెలిపారు. ఇందుకు సమగ్ర నివేదిక రూపొందించనున్నట్లు చెప్పారు. సమీక్షలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ టి.ప్రసాద్, నర్సంపేట ఉమెన్ సబ్ జైలు సూపరింటెండెంట్ కేఎన్ఎస్.లక్ష్మీశృతి, డీసీఆర్‌బీ డీఎస్పీ ఎ.రాములు పాల్గొన్నారు.

ప్రజా వినతులపై సత్వరమే స్పందించాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి ఏప్రిల్ 15: ప్రజా వినతులపై ఆయా శాఖల అధికారులు సత్వరమే స్పందించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిపై అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణి వినతులను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వినతులకు అధిక ప్రాధాన్యమిచ్చి వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 22 వినతులు వచ్చాయి. ఈకార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలి

భూపాలపల్లి పట్టణంలో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. మునిసిపల్, సింగరేణి అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. తాగునీటి సమస్య అధికంగా ఉన్న కాలనీలను గుర్తించి సింగరేణి పైపులైన్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సింగరేణి జీఎం శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో యువతి దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

వామపక్ష లౌకిక శక్తులను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య

గోవిందరావుపేట, ఏప్రిల్ 15: పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద పార్టీలను ఓడించి వామపక్ష లౌకిక శక్తులను గెలిపించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఎస్.వీరయ్య అన్నారు. మండలంలోని పస్రాలో సీపీఎం జిల్లాస్థాయి సమావేశం పొదిళ్ల చిట్టిబాబు అధ్యక్షతన సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లు భారతదేశాన్ని పాలించిన బీజేపీ ఈసారి అధికారంలోకి రాలేమనే భయంతో న్యాయ వ్యవస్థకే తిలోదకాలిచ్చి అధికారమే పరమావధిగా ఇతర పార్టీలు, నాయకులను అణగదొక్కుతూ జైలుపాలు చేస్తోందని విమర్శించారు. రైతుల సంక్షేమాన్ని, పంటలకు గిట్టుబాటు ధరను పట్టించుకోని ప్రభుత్వం పూర్తిస్థాయిలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ పెట్టుబడిదారీ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు సిద్ధపడుతోందని అన్నారు. గతంలో దొంగ వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వానికి రైతులు, ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో రెండు పర్యాయాలు ఎన్నుకున్న ప్రజలు ఈసారి బీజేపీపై విరక్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకులు, కవితను జైలులో పెట్టిన బీజేపీని ఓడించేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో సోయిలేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, నాయకులు తీగల ఆగిరెడ్డి, బీరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, ఎమ్డీ.దావూద్, తదితరులు పాల్గొన్నారు.

పశువులను రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు

ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 15: నిబంధనలకు విరుద్ధంగా పశువులను రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల ను అరెస్టు చేసినట్లు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డు వద్ద సాధారణ తనిఖీల్లో భాగంగా పోలీసులు సోమవారం తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మండల కేంద్రం నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న వాహనంలో ఎలాంటి అనుమతి లేకుండా నాలు గు ఎద్దులు, రెండు లేగలను ఒకదానిపై ఒకటి ఎక్కించు కుని కోదాడ సంతలో విక్రయించేందుకు తీసుకెళ్తూ పట్టుబడినట్లు వివరించారు. డ్రైవర్ కరీముల్లా, పశువుల యజమాని మండవ నరేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. పట్టుబడిన పశువులను రాంపూర్ గోశాలకు తరలించామని చెప్పారు.

నగదు పట్టివేత

వాజేడు, ఏప్రిల్ 15: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వా జేడు పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు. మం డలంలోని ఇప్పగూడెం క్రాస్‌రోడ్డు గుమ్మడిదొడ్డి వద్ద ఎస్సై వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. మండలంలోని చింతూరు గ్రామానికి చెం దిన కల్లూరి శ్రీనివాస్ ద్విచక్రవాహనాన్ని తనిఖీ చేయగా రూ.80 వేల నగదు లభ్యమైందని ఎస్సై తెలిపారు. నగ దుకు ఎలాంటి ఆధారాలు చూపించని కారణంగా సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్‌కు పంపించినట్లు పేర్కొన్నారు.

ఓటరు నమోదుకు ముగిసిన గడువు

- కొత్త దరఖాస్తులు 1,595

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 15: కొత్తగా ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం ఇచ్చిన గడువు సోమవారం తో ముగిసింది. 2024 జనవరి1 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందు కు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చింది. దీంతో కొత్తగా 1,595 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారు లు తెలిపారు.

నేడు కాంగ్రెస్ సన్నాహక సమావేశం

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 15: భూపాలపల్లిలోని కుందూరుపల్లిలో పార్లమెంటు ఎన్నికల కాంగ్రెస్ భూపా లపల్లి నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దీన్ని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ వరంగల్ ఎంపీ కడియం కావ్య గెలుపును కాంక్షిస్తూ ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కడియం కావ్యతోపాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు హాజరవుతారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బాలసముద్రం, ఏప్రిల్ 15: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని దళిత, గిరిజన టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పెండ్యాల కొమురయ్య ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టి వారి సమస్యలను పరిష్కరించాలని పెండ్యాల కొమురయ్య డిమాండ్ చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంద నరేశ్

వరంగల్ లోక్‌సభ బరిలో ఉంటా..

ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 15: వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ చెప్పారు. సోమవారం కేయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంద నరేశ్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో విద్యార్థి ఉద్యమకారులకు ఏ రాజకీయపార్టీ టికెట్లు కేటాయించకపోవడాన్ని ఖండించారు. తాను విద్యార్థి సమస్యలపై పోరాటం చేసినట్లు తెలిపారు. పోరాటాలు చేసిన క్రమంలో కేసులపాలైనట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడినట్లు వివరించారు. పార్టీలు మారిన రాజకీయ నాయకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తాను ఎంపీగా గెలిస్తే నీతి, నిజాయితీగా పనిచేస్తానని, అందరూ తనను ఆశీర్వదించి గెలిపించాలని అన్నారు. ఈ సమావేశంలో కేయూ విద్యార్థి నాయకులు అరిస్టాటిల్, వివేకనంద, సిద్ధు, నవీన్, కిరణ్, సాయి, వెంకటేశ్, సందీప్, కల్యాణ్, సురేశ్, రాజు, రమేశ్, నరేందర్, సూర్య, దిలీప్, శివ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ఇద్దరు మృతి

కాజీపేట, ఏప్రిల్ 15: ఉప్పల్ రైల్వేస్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు ప్రయాణికులు మృతిచెందారు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ ఆగ్రాకు చెందిన అరుణ్ (21) ఆగ్రా నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా సోమవారం ఉప్పల్ రైల్వేస్టేషన్ వద్ద రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. కాగా, సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన ఫిరోజ్ (25) సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు సోమవారం కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తుండగా హసన్‌పర్తి రైల్వే స్టేషన్ ఫిరోజ్ రైలు నుంచి జారిపడ్డాడు. ఈ ఘటనలో అతడి రెండు కాళ్లు తెగిపడ్డాయి. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు అపస్మారక స్థితిలో ఉన్న ఫెరోజ్‌ను ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుల వద్ద ఆధారాల మేరకు వారి కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

కడియం కావ్యకు సంపూర్ణ మద్దతు

కాజీపేట, ఏప్రిల్ 15: కాంగ్రెస్ లోక్‌సభ వరంగల్ అభ్యర్థి కడియం కావ్యకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని మాదిగ హక్కుల దండోరా, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు జన్ను కనుకరాజ్, ఈటక రాజు మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా కాజీపేట సోమవారం మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ఎస్సీలకు వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. బీజేపీకి మద్దతు ప్రకటిస్తున్న మంద కృష్ణ మాదిగను మాదిగలు వ్యతిరేకిం చాలన్నారు. మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిన బీజేపీ అభ్యర్థులను మాదిగలంతా ఐక్యంగా వుండి లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఈ మీడియా సమావేశంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. పద్మయ్య జిల్లా అధ్యక్షులు వేముల బలరాములు, నాయకులు కోరిపల్లి శ్రీనివాస్, వీరయ్య,సి. బాలరాజ్, కొట్టె శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి 5కే రన్ వాయిదా

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 15: ఓటరు చైతన్యంపై నేడు ఉదయం 6గంటలకు నిర్వహించే 5 కేరన్‌న అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ 5కే రన్ ఎప్పుడు నిర్ణయించేది త్వరలో చెబుతామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

హత్యానేరం కేసులో ఒకరికి జీవిత ఖైదు, జరిమానా

వరంగల్ లీగల్, ఏప్రిల్ 15: పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఒకరిని అతిదారుణంగా హత్యచేసిన వ్యక్తిపై నేరం రుజువైనందున యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి ఎం.కృష్ణమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపేట గ్రామానికి చెందిన అలుపుల సమ్మయ్యకు అదే గ్రామానికి చెందిన దడబోయిన శంకరయ్యకు చిన్నచిన్న తగాదాలు ఉండేవి. రెండేళ్ల కిందట అలుపుల సమ్మయ్య.. శంకరయ్యపై దాడి చేయడంతో మడికొండ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. పాతకక్షలు మనసులో పెట్టుకొని 2021జూలై 10న ఎప్పటిలాగా అలుపుల సమ్మయ్య ఉదయం సమయంలో మనవడితో కలిసి యోగా, వాకింగ్ చేయడానికి వెళ్లాడు. ఇది గమనించిన శంకరయ్య యోగా చేస్తున్న సమ్మయ్యపై గొడ్డలితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈవిషయాన్ని అదేగ్రామానికి చెందిన కట్ల వీరారెడ్డి.. సమ్మయ్య భార్యకు తెలపడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుంది. అనంతరం తన భర్త అలుపుల సమ్మయ్యపై దాడి చేసి కిరాతకంగా చంపిన దడబోయిన శంకరయ్యపై మడికొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడు శంకరయ్యపై హత్యానేరం కేసు నమోదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయ మూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ వి.రాజేష్ సాక్షులను ప్రవేశపెట్టగా మంతెన రవికుమార్, డి.ప్రతాప్ దర్యాప్తు అధికారులుగా వ్యవహరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సత్యనారాయణ కేసు వాదించారు.

కేజీబీవీ విద్యార్థినులకు ఎప్‌సెట్ కోచింగ్

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 154 మంది విద్యార్థులకు షార్ట్ టర్మ్ కోచింగ్

ర్యాంకులే లక్ష్యంగా హసన్‌పర్తి కేజీబీవీలో నెల పాటు సాగనున్న ఉచిత శిక్షణ


హసన్‌పర్తి కేజీబీవీ ఎప్‌సెట్ కోచింగ్ సెంటర్‌లో తరగతులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుకుంటున్న విద్యార్థినులకు ఇకనుంచి ఎప్‌సెట్ (ఇంజినీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ)లో ర్యాంకుల పంట పండనుంది. ఇందుకోసం ఈ ఏడాది నుంచి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన కేజీబీవీల్లో ఎప్‌సెట్ షార్ట్ టర్మ్ కోచింగ్‌ను నెల పాటు ప్రభుత్వం అందిస్తుంది. దీంతో ర్యాంకుల సాధనలో ప్రైవేటు, ప్రతిభ గురుకుల జూనియర్ కళాశాలల సరసన కేజీబీవీలు చేరనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా కేజీబీవీల్లో ఈ విద్యా సంవత్సరం ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్షలు రాసిన 154 మంది విద్యార్థులను ఎంపిక చేసి హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి కేజీబీవీలో నెల పాటు ఉచితంగా వసతులతో కూడిన ఎప్‌సెట్ ఫ్రీ షార్ట్ టర్మ్ కోచింగ్ అందిస్తున్నారు. ఏప్రిల్ 1న ప్రారంభమైన ఈ కోచింగ్ మే 1తో ముగియనుంది.

విద్యార్థులకు వరం

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులకు వరంగా మారింది. ఈ ఏడాది నుంచి కేజీబీవీల్లో ఇంటర్ విద్య పూర్తి చేసిన వారికి అదే ఏడాది ఎప్‌సెట్‌కు నెల రోజుల పాటు షార్ట్ టర్మ్ కోచింగ్ ఇవ్వడంపై కేజీబీవీల విద్యార్థినులు ప్రైవేటు, ఆదర్శ గురుకుల జూనియర్ కళాశాలల పక్కన చేరనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని కేజీబీవీల్లో చదువుతున్న 154మంది విద్యార్థినులకు హసన్‌పర్తి కేజీబీవీలో ఏప్రిల్ 1 నుంచి ఎప్‌సెట్ కోచింగ్ క్యాంపు ప్రారంభమైంది. అన్ని వసతులతో కూడిన ఉచిత శిక్షణను ఇక్కడ నెల రోజుల పాటు అందించనున్నారు.

నిష్ణాతులైన అధ్యాపక బృందం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కేజీబీవీల్లో బోధిస్తున్న పీజీసీఆర్‌టీల్లో మెరికలైన వారిని ఎంపిక చేసి వారితో విద్యార్థినులకు కోచింగ్ ఇస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థినులకు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ తదితర విభాగాల్లో సీట్లు సాధించేందుకు తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతీ విద్యార్థినిపై దృష్టిపెట్టి కోచింగ్ సాగుతోంది. కోచింగ్‌తో పాటు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నారు. సబ్జెక్టుల్లో టాపిక్‌లు పూర్తి కాగానే అందులో విద్యార్థుల టెస్ట్‌లు నిర్వహిస్తూ పూర్తిగా కార్పొరేట్ స్థాయిలో కోచింగ్ నిర్వహిస్తున్నారు. ఈ కోచింగ్ సఫలీకృతమైతే కేజీబీవీ విద్యార్థులకు ఎప్‌సెట్‌లో ర్యాంకుల పంట పండనుంది.

జిల్లాల వారీగా విద్యార్థినులు సంఖ్య

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 154 మంది విద్యార్థినులను ఎంపిక చేసి కోచింగ్ ఇస్తున్నారు. వరంగల్ జిల్లాలో 10 కేజీబీవీల నుంచి 10 మంది విద్యార్థినులు, హనుమకొండలో 9 కేజీబీవీల నుంచి 90 మంది, జనగామలోని 12 కేజీబీవీల నుంచి 14 మంది, ములుగులోని 9 కేజీబీవీల నుంచి 12 మంది, జయశంకర్ భూపాలపల్లిలోని 10 కేజీబీవీల నుంచి 18 మంది విద్యార్థినులు మొత్తం 154 మంది విద్యార్థినులు ఈ కోచింగ్ సెంటర్‌లో ఎప్‌సెట్‌కు ప్రత్యేకమై శిక్షణ తీసుకుంటున్నారు.

విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ ఎండి. అబ్దుల్‌హై, హనుమకొండ డీఈవో



ప్రభుత్వం కేజీబీవీ విద్యార్థినుల కోసం మంచి కార్యక్రమం చేపట్టింది. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అధ్యాపకులు బోధిస్తున్న విషయాలను నేర్చుకొని అనుమానాలను నివృత్తి చేసుకోవాలి. ఎలాంటి ఒత్తిడులకు గురికాకుండా నెల రోజుల పాటు కష్టపడితే ఎప్‌సెట్‌లో మంచి ర్యాంకు సాధించి వారు కోరుకున్న కళాశాలలో సీటు సాధించే అవకాశం ఉంది. నిబద్ధతతో అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు. నెల రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ షార్ట్ టర్మ్ ఎప్‌సెట్ కోచింగ్‌తో విద్యార్థినులు ర్యాంకులు సాధించే అవకాశం ఉంది.



ప్రణాళికాబద్ధంగా శిక్షణ సాగుతోంది..

సముద్రాల సునిత, జీసీడీవో, హనుమకొండ



ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఈవో ఆధ్వర్యంలో ఏప్రిల్ 1న హసన్‌పర్తిలోని కేజీబీవీలో కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించాం. నెల రోజులకు ప్రణాళికలను రూపొందించుకొని విద్యార్థినులకు కోచింగ్ ఇస్తున్నాం. నిరంతరం పర్యవేక్షిస్తూ, కోచింగ్ క్యాంపు ఎస్‌వో, అధ్యాపకులను సమన్వయం చేస్తూ కోచింగ్ నిర్వహిస్తున్నాం. పేద విద్యార్థినులకు ఎప్‌సెట్‌లో ర్యాంకులు సాధించే విధంగా ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశపెట్టిన కోచింగ్ సెంటర్‌లో లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కేజీబీవీల్లో పనిచేస్తున్న నిష్ణాతులైన పీజీసీఆర్‌టీలు కార్పొరేట్ స్థాయిలో సబ్జెక్టులను బోధిస్తున్నారు. బోధన తరగతులతో పాటు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. మే 1 తో శిక్షణ ముగుస్తుంది. ఈ కోచింగ్ సెంటర్ నుంచి చాలా మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధిస్తారని ఆశిస్తున్నాం.

ర్యాంక్ సాధిస్తా..

ఎన్. శైలజ, వెంకటాపూర్ కేజీబీవీ, ములుగు



షార్ట్ టర్మ్ కోచింగ్‌తో ఎప్‌సెట్‌లో మంచి ర్యాంకు సాధిస్తా. అధ్యాపకులు అద్భుతంగా బోధిస్తున్నారు. మంచి ఇంజనీరింగ్ కళాశాలలో సీటు సాధిస్తాను. కోచింగ్ సెంటర్‌లో వసతులు బాగానే ఉన్నాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదుకునేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా..

ఎం.బేబి, పాలకుర్తి కేజీబీవీ, జనగామ జిల్లా



కేజీబీవీల్లో ఈ ఏడాది ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన షార్ట్ టర్మ్ ఎప్‌సెట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుంటాను. ఈ నెల రోజుల పాటు లెక్చరర్లు బోధిస్తున్న పాఠ్యాంశాలను శ్రద్ధగా చదువుతూ మంచి ర్యాంకు సాధిస్తాను. ఇక్కడి కోచింగ్ సెంటర్‌లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. లెక్చరర్లు అందరూ బాగా బోధిస్తున్నారు.

మే 1నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్15: తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్) ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో మే 1నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అధికారి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో శిక్షణ పొందేందుకు 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న బాల బాలికలు అర్హులని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంతో పాటు ఇతర క్రీడా మైదానాలలో పలు క్రీడాంశాలలో అనుభవజ్ఞులైన కోచ్‌ల ద్వారా నామమాత్రపు ఫీజు (పేఅండ్‌ప్లే) పద్ధతిన నెల పాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అదే విధంగా మండల, గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించనున్న క్రీడా శిక్షణ శిబిరాలను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలో క్రీడా శిబిరాలను నిర్వహించేందుకు పీడీ, పీఈటీ లేదా సీనియర్ క్రీడాకారులు ఈ నెల 25వరకు హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియంలోని డీఎస్ఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం 9392997668 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వరంగల్ లోక్‌సభ ఎన్నిక ఓబీసీ ఇన్‌చార్జ్‌ల నియామకం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 15: వరంగల్ లోక్‌సభ ఎన్నికలో భాగంగా ఓబీసీ సెల్ నాయకులను ఇన్‌చార్జిలుగా నియమిస్తూ టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ప్రకటించారు. ఇన్‌చార్జిగా నియమితులైన వారిలో ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్ ముదిరాజ్, స్టేట్ కో-ఆర్డినేటర్ సంధుపట్ల ధన్‌రాజ్, జాయింట్ కో-ఆర్డినేటర్లు బండారి జనార్దన్‌గౌడ్, పులి గణేశ్ ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలో పార్టీ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య గెలుపు కోసం వీరు బాధ్యతలను నిర్వహించనున్నారు.

నవజాత శిశువు మృతదేహం లభ్యం


చెరువులో లభ్యమైన శిశువు మృతదేహం

ఎల్కతుర్తి, ఏప్రిల్ 15: ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్ గ్రామ చెరువులో సోమవారం ఓ నవజాత మగ శిశువు శవం లభ్యమైంది. గ్రామ శివారులోగల చెరువులో నవజాత శిశువు శవం కనిపించడంతో గ్రామస్తులు భారీగా వెళ్లి చూశారు. దీంతో సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి తరలివెళ్లి పరిశీలించారు. శిశువు చేతులకు చికిత్సకు సంబంధించిన ప్లాస్టర్ వేసి ఉన్నాయి. దీంతో ఏవరో ఆస్పత్రి నుంచి తీసుకొచ్చి చెరువులో వేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. శిశువు ఎండతాకిడికి తట్టుకోలేక మృతి చెంది ఉంటుందని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు పలు కోణాలలో ఆరా తీస్తున్నారు.

ప్రజలను ఓటడిగే హక్కు కోల్పోయిన కేసీఆర్

తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ కూరపాటి వెంకట నారాయణ

కాజీపేట జంక్షన్, ఏప్రిల్ 15: ప్రజలు నమ్మి అధికారం ఇస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి అధికారం కోల్పోయిన కేసీఆర్ ప్రస్తుతం బలమైన ప్రతిపక్షం ఉండాలని ప్రజలకు హితబోధ చేస్తున్నారని తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని తన స్వగృహంలో ఉద్యమకారులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలను ఓటు అడిగే హక్కును కోల్పోయిన విషయాన్ని మర్చిపోతున్నాడని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఎవరూ ఓటు వేయవద్దని, ఆ పార్టీ అభ్యర్థిని కూడా గెలవకుండా చూడాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమకారులకు ఆయన పిలుపునిచ్చారు. దశాబ్దకాలంలో ప్రజల గొంతుకలైన ప్రతిపక్షాలను చీల్చి బ్లాక్‌మెయిల్ చేసి తాయిలాలు ఇచ్చి నాయకులకు దోపిడీ చేయడానికి అవకాశం కల్పించి ప్రజల భూములను, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టి చరిత్ర సృష్టించారని ఆయన పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

కుమార్తె లిక్కర్ స్కాంలో జైలుపాలైందని, వారి కుటుంబానికి దగ్గరి బంధువులకు, అధికారులకు అందినంత దోపిడీ చేసుకోవడానికి అవకాశాలు ఇచ్చి విధ్వంసం సృష్టించారని ప్రజలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి ప్రగతి భవన్ నుంచి గెంటివేశారని ఆయన ఎద్దేవా చేశారు. విద్యాసంస్థలను నిర్వీర్యం చేసి బహుజన వర్గాలను అణచివేసిన కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు రాజకీయంగా బొందపెట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టి ప్రజలను మోసంగించే మాటలు చెప్పి పార్టీని బతికించుకొని ఆస్తులను కాపాడుకోవడానికి కేసీఆర్ బస్సు యాత్రలు, రోడ్‌షోలు సిగ్గుపడకుండా కొనసాగిస్తున్నాడని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు సుమారు రూ.25వేల కోట్ల వడ్డీలు కట్టవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి మరో ఆరునెలల కాలం నుంచి పథకాలు అమలు చేయడానికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ క్లిష్టమైన సమయంలో ప్రజలు తమ ఓటును దోపిడీదారులకు వేయకుండా జాగ్రత్తపడా లని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఇంకా ఉద్యమకారులు డాక్టర్ కె. వీరస్వామి, చింతకింది కుమారస్వామి పాల్గొన్నారు.

వడ్డీ మాఫియా!

(5వ పేజీ తరువాయి)

ప్రాంతంలో ఇద్దరు కార్పొరేటర్లు, మరో పది మంది చోటామోటా లీడర్లు ఈ ఫైనాన్స్ దందాలో ఉన్నారని, వీరికి రాజకీయ నేతల అండదండలతో పాటు పోలీసులు సహకారం ఉందనే ప్రచారం జరుగుతోంది. కొందరు ఖాకీలు కూడా ఫైనాన్స్‌లో భాగస్వాములుగా ఉన్నారని, దీంతో అధిక వడ్డీల దందా మూడు పువ్వులు ఆరు కాయాలు చందంగా సాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే జనగామ జిల్లాలో జనగామ, స్టేషన్‌ఘనపూర్, వరంగల్ జిల్లా నర్సంపేట, వర్ధన్నపేట, హనుమకొండ జిల్లా పరకాల, కమలాపూర్ ప్రాంతాల్లో భారీగా అక్రమ ఫైనాన్స్ దందా సాగుతోంది. అయితే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న గిరిగిరి దందాలో రాజకీయ నేతలతో పాటు కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లు కూడా ప్రముఖంగా ఉన్నట్టు సమాచారం. రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలవడంతో చాలా మంది రియల్టర్లు కూడా అధిక వడ్డీ వ్యాపారంలోకి అడుగు పెడుతున్నారు. లక్ష పెట్టుబడి పెడితే సంవత్సరం తిరుగక ముందే లక్ష రుపాయలు వడ్డీ వస్తుండటంతో కోట్లాది రుపాయలను వడ్డీ వ్యాపారంలో పెట్టి పేదలను జలగల్లా పీడిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ అధిక వడ్డీ వ్యాపారంపై పోలీసులకు ఫిర్యాదుల అందిన పట్టించుకోవటం లేదనే ఆరోపణలున్నాయి. ఎదైనా సంఘటన జరిగినప్పుడే హడావిడి చేసి చేతులు దులుపుకోవటం మినహా పోలీసులు చేసేదేమీ ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సుధీర్‌కుమార్

కేటీఆర్‌ను కలిసిన సుధీర్‌కుమార్

రాంనగర్, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి తనకు అవకాశం ఇచ్చినందుకు సుధీర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు మధుసూధనాచారి, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నేతలు వినయభాస్కర్, రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపనేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి తదితరులున్నారు.

మార్కెట్లో మరింత తగ్గిన మిర్చి ధరలు

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 15: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మిర్చి ధరలు మరింత తగ్గాయి. ఈనెల 5న పలికిన ధరలకు సోమవారం పలికిన ధరకు చాలా తేడా ఉంది. వరుస సెలవుల రావడంతోపాటు రోజురోజుకూ ధరలు పతనమవుతుండడంతో రైతులు తమ దగ్గర ఉన్న మిర్చి పంటను వెంటనే అమ్ముకునేందుకు మార్కెట్‌కు తరలిస్తున్నారు. దీంతో మార్కెట్‌కు మిర్చి బస్తాలు పోటెత్తుతున్నాయి. మిర్చి పెద్దఎత్తున రావడంతో ధరలు పడిపోతున్నాయని వ్యాపార వర్గాలు చెపుతున్నాయి. .

మిర్చి ధర క్వింటాల్లో...

రకం	మార్చి 6న	ఏప్రిల్ 10న	ఏప్రిల్ 15న
తేజ రకం	రూ.20,300	రూ.19,000	రూ.18,300
వండర్‌హాట్	రూ.19,500	రూ.15,500	రూ.15,000
యుఎస్ 341	రూ.18,000	రూ.15,200	రూ.15,500
దేశీ	రూ.38,000	రూ.26,000	రూ.27,000
సింగిల్‌పట్టి	రూ.42,500	రూ.43,500	రూ.30,000
తాలు	రూ.8,500	రూ.7,000	రూ.7,000

మావోయిస్టుల బంద్ ప్రశాంతం

• ముమ్మరంగా పోలీసుల తనిఖీలు • నైట్ హాల్ట్ సర్వీసులను నిలిపివేసిన ఆర్టీసీ • ఇసుక రీచ్‌ల మూసివేత

వాజేడు, ఏప్రిల్ 15: మావోయిస్టులు పిలుపునిచ్చిన ఐదు రాష్ట్రాల బంద్ ఏజెన్సీలో ప్రశాంతంగా ముగిసింది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులు మృతిచెందిన నేపథ్యంలో ఐదు రాష్ట్రాల బంద్‌కు పిలుపునివ్వడంతో ఉత్కంఠ వాతావరణం నెలకోగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకపోవడంతో ఏజెన్సీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు మావోయిస్టుల చర్యల్ని తిప్పికొట్టేందు పోలీసు బలగాలు సరిహద్దు అడవుల్లో ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగుడెం జిల్లా చర్ల మండలంతోపాటు ములుగు జిల్లాలో వెంకటాపురం, వాజేడు మండలాల్లోని సరిహద్దు అటవీ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని జల్లెడ పడుతున్నట్లు తెలుస్తోంది.

బంద్ నేపథ్యంలో జిల్లాలోని వాజేడు, వెంకటాపురం మండలాల్లో నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌లను అధికారులు మూసివేశారు. మావోయిస్టులు విధ్వంసం సృష్టించే ఆస్కారం ఉండటంతో ముందస్తు


జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తున్న వాజేడు ఎస్సై

చర్యల్లో భాగంగా ఇసుక రీచ్‌లను తెరవద్దని సంబంధిత కాంట్రాక్టర్లకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు రాత్రివేళల్లో ఇప్పటికే ఆర్టీసీ సర్వీసులను సైతం మూసి వేయడంతో సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏజెన్సీలో పలు అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు సంబంధించి భారీ యంత్రాలను సైతం పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

ముమ్మరంగా తనిఖీలు

మావోయిస్టుల బంద్ నేపథ్యంలో ఏజెన్సీలో పోలీసులు అలర్ట్ అయ్యారు. ఇప్పటికే సర్కిల్ పరిధిలోని వాజేడు, పేరూరు, వెంకటాపురం పోలీస్‌స్టేషన్లతోపాటు అలుబాక సీఆర్పీఎఫ్ ఔట్‌పోస్టుకు సైతం పటిష్ఠ భద్రతను పెంచినట్లు తెలుస్తోంది. పేరూరు, వాజేడు, వెంకటాపురం ఎస్సైలు రమేష్, వెంకటేశ్వర్లు, అశోక్ విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి నిత్యం రాకపోకలు సాగించే వ్యక్తుల వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ప్రయాణికుల బ్యాగులను, వాహనాలను క్షుణ్ణంగా సోదా చేస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేస్తున్నారు.

సురక్షిత ప్రాంతాలకు నేతలు

మావోయిస్టుల హిట్‌లిస్ట్‌లో ఉన్న నేతలు, ఇతర ప్రముఖులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా పోలీసులు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. బంద్ ముగిసే వరకు సొంత ఊర్లకు రావొద్దని సూచించినట్లు తెలిసింది. ప్రతీకారంతో రగిలిపోతున్న మావోయిస్టులు ఎలాంటి చర్యలకైనా పాల్పడే అవకాశం ఉండటంతో ఈ మేరకు అప్రమత్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో చాలా మంది సురక్షిత ప్రాంతాలకు వెళ్లి తలదాచుకున్నట్లు సమాచారం.

సీఎంను కలిసిన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 15: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని భూపాలపల్లి కాంగ్రెస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.


సీఎం రేవంత్‌తో రాజేందర్

ఆర్వో ప్లాంటును ప్రారంభించిన ఎస్పీ

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఏప్రిల్ 15: భూపాలపల్లిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆర్వో ప్లాంటును ఎస్పీ కిరణ్ ఖరే సోమవారం ప్రారంభించారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడుతామని ఆయన అన్నారు. పోలీసులు అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం ప్రజాదివస్ కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాల నుంచి వచ్చిన 11 మంది బాధితుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్, డీపీవో ఏవో


ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

ఫర్హానా, సూపరింటెండెంట్ సోఫియా సుల్తానా, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు కిరణ్, రత్నం, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాటారం పీఏసీఎస్ చైర్మన్‌పై

నెగ్గిన అవిశ్వాసం?

హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో రహస్యంగా సాగిన ప్రక్రియ!

అధికారికంగా వెల్లడించని అధికారులు


అవిశ్వాస తీర్మానానికి ముందు పీఏసీఎస్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ డైరెక్టర్లు, నాయకులు

మహదేవపూర్ రూరల్ (కాటారం) ఏప్రిల్ 15 : కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డిపై కాంగ్రెస్ డైరక్టర్లు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు తెలుస్తోంది. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మొత్తం 13 మంది డైరక్టర్లలో 11మంది హాజరు కాగా చైర్మన్ సహా మరో డైరెక్టర్ గైర్హాజరైనట్లు సమాచారం. ఫిబ్రవరి 15న ప్రస్తుత చైర్మన్‌పై కాంగ్రెస్ అవిశ్వాసం ప్రవేశపెట్టగా తనకు ఎలాంటి సమయం ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా వ్యవహరించారని చల్ల నారాయణరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ఏప్రిల్ 15న అవిశ్వాస సమావేశం ఏర్పాటు ఫలితాలను సీల్డ్‌కవర్‌లో సమర్పించాలని, ఏప్రిల్ 25న ఫలితాలను వెల్లడించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టు తెలిసింది. అప్పటి వరకు ఫలితాలను బహిర్గతం చేయొద్దని ఆదేశించింది. దీంతో అవిశ్వాస ప్రక్రియను అధికారులు రహస్యంగా నిర్వహించారని తెలుస్తోంది.

అన్నె సంతోష్ స్మారక స్తూపం ఏర్పాటు

ఇంటి ఆవరణలోనే ఆవిష్కరించిన తల్లిదండ్రులు

మహదేవపూర్ రూరల్(కాటారం), ఏప్రిల్ 15 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కాంకేర్ అటవీ ప్రాంతంలో ఈనెల 7న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన దస్తగిరిపల్లె వాసి, మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు అన్నె సంతోష్ జ్ఞాపకార్థం ఆయన తల్లిదండ్రులు స్మారక స్తూపాన్ని తమ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేశారు. బంధుమిత్రుల కమిటీ సభ్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా విప్లవో ద్యమంలో సంతోష్ పయనించిన తీరును వక్తలు కొనియాడారు. ఈకార్యక్రమంలో బంధుమిత్రుల కమిటీ అధ్యక్షురాలు అంజమ్మ, ప్రధాన కార్యదర్శి పద్మకుమారి, ట్రెజరర్ శాంత, పౌరహక్కుల సంఘం నాయకులు లక్ష్మణ్ నారాయణ, విరసం నేత రాజన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

రేగొండ, ఏప్రిల్ 15: పార్లమెంటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని సీఐ మల్లేష్ యాదవ్ కోరారు. రేగొండ, గోరికొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా సన్మార్గంలో నడవాలని సూచించారు. ఎన్నికల్లో ప్రలోభాలు, బెదిరింపులకు గురికావద్దని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవికుమార్, ఎస్సై-2 శ్రీలత, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ములుగు కోర్టుకు నూతన భవనం నిర్మించాలి

హైకోర్టు పోర్ట్‌పోలియే జడ్జికి బార్ సభ్యుల వినతి

ములుగు, ఏప్రిల్ 15: ములుగు జిల్లా కోర్టుకు నూతన భవనాన్ని నిర్మించాలని, ఇందుకు సంబంధించి సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ హైకోర్టు పోర్ట్ పోలియే జడ్జి పుల్ల కార్తీక్‌ను ములుగు బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు బార్ అధ్యక్షుడు మసరగాని వినయ్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌కు వెళ్లిన అడ్వకేట్లు జడ్జిని కలిసి వినతిపత్రం సమర్పించడంతోపాటు శాలువాతో సన్మానించారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్, కార్యదర్శి సునీల్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు వి.నర్సిరెడ్డి, సారంగపాణి, భిక్షపతి, రాజ్‌కుమార్, సూర్యం పాల్గొన్నారు.


పోర్ట్ పోలియే జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

నేటి నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు

మహదేవపూర్, ఏప్రిల్ 15: మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ రామాలయంలో శ్రీ రామ నవమి ఉత్సవాలు చైత్రశుద్ధ అష్టమి మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. చైత్ర శుద్ధ దశమి గురువారం వరకు కొనసాగ నున్నాయి. ఇందులో భాగంగా మంగళ వారం 4 గటంలకు అధ్యయనో త్సవం, ప్రబంధ పారాయణం, 8 గంటలకు ఎదుర్కోలు సేవ, బుధవారం ఉదయం భగవత్ పుణ్యాఃవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణం, ఉదయం 10.31 గంటలకు ఆశ్లేష నక్షత్రయుక్త మిథున లగ్న పుష్కరాంశాన శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు హవనం, బలి ప్రదానం, గురువారం పూర్ణాహుతి జరగనుంది. ఈ సందర్భంగా భక్తులకు తాగునీటి సౌకర్యంతోపాటు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా టెంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో మారుతి తెలిపారు.


కాళేశ్వరంలోని రామాలయం

మళ్లీ పెరిగిన ఉష్ణోగ్రతలు

● మంగపేటలో 43.8 డిగ్రీలు

ములుగు, ఏప్రిల్ 15: జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. మూడురోజులు వాతావరణం కొంత చల్లబడగా జనం ఉపశమనం పొందారు. కానీ, సోమవారం 40 డిగ్రీలు దాటడంతో అల్లాడిపోయారు. అత్యధికంగా మంగపేట మండలంలో 43.8 డిగ్రీల వేడి నమోదైంది. వెంకటాపురం(నూగూం)లో 43.6, తాడ్వాయి మండలం మేడారంలో 43 డిగ్రీలు, వాజేడు మండలం ధర్మవరంలో 42.5, వెంకటాపూర్(రామప్ప) మండలం లక్ష్మీదేవిపేటలో 41.9, ములుగు మండలం మల్లంపల్లిలో 41.5, కన్నాయిగూడెంలో 41.4, గోవిందరావుపేటలో 41.4, ఏటూరునాగారంలో 41.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. దీంతో వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఇక నుంచి ఉష్ణోగ్రతలు ఇదే స్థాయిలో నిలకడగా కొనసాగుతాయని, ఒక్కోసారి పెరిగే అవకాశముంటుందని తెలిపారు. ప్రజలు ఎండవేడి నుంచి జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

బీజేపీ అభ్యర్థి రమేష్‌ను గెలిపించాలి

జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి

చిట్యాల, ఏప్రిల్ 15: పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశీధర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రం సోమవారం ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందని, పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటును అభ్యర్థించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్, గుండ సురేష్, చెక్క నర్సయ్య, రవీందర్, షైదం శ్రీకాంత్, ప్రవీణ్, కుమారస్వామి, శ్రీహరి, రాజేందర్, ర్యాకం శ్రావణ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 15: ప్రజా సమస్యలపై ఆయా శాఖల అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రజావాణిలో వచ్చిన వినతులను పరిశీలించి ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆమె వినతులు స్వీకరించారు. వాటిపై అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన వినతులను పరిష్కరించేందుకు వీలుకాని పక్షంలో అందుకు కారణాలను అర్జిదారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ను అందించాలి

ఖరీఫ్ సీఎంఆర్ ధాన్యాన్ని మే 30లోగా అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి రైస్‌మిల్లు యజమానులను ఆదేశించారు. కల్టెరేట్ సమావేశపుహాల్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రబీ ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని, కారణాలు చూపించి కోతలు విధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యాన్ని దిగుమతి చేసుకునే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి ఆటంకాలు లేకుండా దిగుమతి చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, సివిల్ సప్లయ్ అధికారి రాంపతి, జిల్లాలోని రైస్‌మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 15: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ములుగులోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ, ప్రధాన కూడళ్లలో సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక సిబ్బంది విన్యాసాల ద్వారా అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర అధికారి ఎమ్డీ.అబ్దుల్‌రహీం, సిబ్బంది నగేష్, మధుసూదన్, భార్గవ్, ఎం.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలి

ఏటూరునాగారం, ఏప్రిల్ 15 : పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో మహబూబాబాద్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పార్టీ మండల ఇన్‌చార్జిలను మంత్రి సీతక్క ప్రకటించారని వెల్లడించారు. ఏటూరునాగారం మండల ఇన్‌చార్జిలుగా గుడ్ల దేవేందర్, ఎమ్డీ. అయ్యూబ్ ఖాన్‌ను నియమించారని తెలిపారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, మండల ఉపాధ్యక్షుడు ఎమ్డీ. రియాజ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎమ్డీ. గౌస్ పాల్గొన్నారు.

పాముకాటుకు గురైన మహిళా కూలీ

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 15: ఉపాధిహామీ పనుల వద్ద మహిళ పాముకాటుకు గురైన సంఘటన మండలంలోని ముకునూరుపాలెం గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామంలోని మిడియం శాంతమ్మ ఉదయం గ్రామస్థులతో కలిసి ఉపాధిహామీ పనులు చేసేందుకు వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తుండగా పాము కాటేసింది. గమనించిన తోటి కూలీలు పామును చంపి శాంతమ్మను వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం శాంతమ్మ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి : కాంగ్రెస్

తాడ్వాయి, ఏప్రిల్ 15: ప్రస్తుతం జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ నాయకుడు బొల్లు రమేష్‌కుమార్ కోరారు. సోమవారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం గద్దెనెక్కి పదేళ్ల అయిందని, మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రుణమాఫీ చేస్తూ చిన్న, సన్నకారు రైతులను పట్టించుకోవడంలేదని విమర్శించారు.. ఎదురు ప్రశ్నిస్తే సీబీఐతో దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఓటర్లు బీజేపీ మోసపూరిత మాటలు నమ్మొద్దని, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

20 నుంచి క్రికెట్ వేసవి శిక్షణ శిబిరం

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 15: ఈ నెల 20 నుంచి క్రికెట్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం కానున్నట్లు భూపాలపల్లి క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సురిమిళ్ల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు. ఈ నెల 16 నుంచి 18వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్యాంపు పూర్తిగా ఉచితమని, క్రీడాకా రులను ఐపీఎల్, రంజీ, జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే విధంగా తయారు చేస్తామని వెల్లడించారు. పూర్తి వివరాలకు 8897805683 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

'హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారు..'

గోవిందరావుపేట, ఏప్రిల్ 15: మండలంలోని పస్రా గ్రామపంచాయతీ హైకోర్టు ఆర్డర్‌ను ఉల్లంఘించిందని జాతీయ ఆదివాసీ గిరిజనాభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్దబోయిన రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 18 గదులను పెసా గ్రామసభ తీర్మానం మేరకు ఆదివాసీలకు కేటాయించి ఉపాధి కల్పించాలని హైకోర్టు జడ్జి ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. అయితే డీపీవో, ఎంపీవోలు ఆ ఉత్తర్వులను ఉల్లంఘించి షాపింగ్ కాంప్లెక్స్ గదులను గ్రామంలోని కొందరికి కేటాయించారని ఆరోపించారు. ఈవిషయమై ప్రభుత్వం స్పందించి షాపింగ్ కాంప్లెక్స్ గదులను ఆదివాసీలకు కేటాయించాలని ఆయన కోరారు.

ఏఐటీటీ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 15: ప్రభుత్వ ఐటీఐ కోర్సుల్లో ప్రైవేటుగా చేరేందుకు ఏఐటీటీ (సీటీఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఈ మేరకు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జగన్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించడానికి ఈనెల 19 గడువుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి

మల్లూర్, ఏప్రిల్ 15 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను నిబంధనల మేరకు చేపట్టాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మల్లారం, వల్లెంకుంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సోమవారం ప్రారంభించారు. రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యం విక్రయించొద్దని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా తక్కువ ధరకు దళారులెవరైనా కొనుగోలు చేస్తే పోలీసు కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. .

ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ పంపిణీ

వెంకటాపూర్(రామప్ప), ఏప్రిల్ 15: మండల కేంద్రం శివారులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు సోమవారం వైద్యసిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ జంగిలి శ్రీలత మాట్లాడుతూ కూలీలు ఉదయం 11గంటలలోపు పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని కూలీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రామాచారి, ఏఎన్ఎం స్వప్న, ఆశా వర్కర్లు సౌజన్య, మాధవి, కవిత, శోభ, సంపూర్ణ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని మహిళల నిరసన

మల్లూర్, ఏప్రిల్ 15 : మండల కేంద్రమైన తాడిచర్ల ఎనిమిదో వార్డు(రేగడిపల్లి)లో నెలకొన్న నీటి సమస్యను తీర్చాలని మహిళలు సోమవారం నిరసన తెలిపారు. వారం రోజులుగా నీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటి సమస్యను తీర్చాలని కోరారు.

ఓసీ-3 వద్ద భూ నిర్వాసితుల ఆందోళన

గణపురం, ఏప్రిల్ 15: మండలంలోని ఓపెన్‌కాస్టు-3 వద్ద సింగరేణి భూ నిర్వాసితులు సోమవారం సాయంత్రం నిరసనకు దిగారు. కొండంపల్లి గ్రామాన్ని త్వరగా తరలించాలని డిమాండ్ చేశారు. బ్లాస్టింగ్‌లతో వచ్చే దుమ్మూధూళితో ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద శబ్దాలతో బ్లాస్టింగ్ చేయడం వల్ల తమ ఇంటి గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఓసీ-3 పీవో భిక్షమయ్య అక్కడికి చేరుకుని నిరసనకారులను సముదాయించారు. త్వరలోనే గ్రామాన్ని తరలిస్తామని, ఇందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని చెప్పడంతో కొండంపల్లి వాసులు నిరసనను విరమించుకున్నారు.

మహబూబాబాద్ పార్లమెంట్ ఓబీసీ ఇన్‌చార్జ్‌గా రవి యాదవ్

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 15: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఓబీసీ ఇన్‌చార్జిగా ములుగు పట్టణానికి చెందిన కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్‌ను నియమించారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసందర్భంగా రవియాదవ్ మాట్లాడుతూ న నియామకానికి సహకరించిన మంత్రులు ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు నూతి శ్రీకాంత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.